క్లుప్తంగా

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

మందస: పెన్షనర్ల సామూహిక, వ్యక్తిగత సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రోణంకి రామచంద్రరావు, కార్యదర్శి ఎ.ధర్మారావు, కోశాధికారి బి.మోహనరావు కోరారు. మందస పట్టణంలోని సంఘం భవనంలో ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. పెన్షనర్లకు అడిషినల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ గత శ్లాబులు కొనసాగించాలని, 2018 జూలై ఒకటి నుంచి రావలసిన డీఆర్ ఏరియర్స్, పీఆర్సీ బకాయిలు చెల్లించాలన్నారు. సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు గుంట కేశవరావు, వాయలపల్లి నారాయణరావు, అంపోలు త్రినాధరావు, మజ్జి బాబురావు, నవీన్‌చంద్ర, కె.వాసుదేవరావు ఉన్నారు.

నందిగాం సర్పంచ్‌కు సన్మానం



రమణమ్మను సన్మానిస్తున్న నాయకులు

నందిగాం: ఇటీవల ఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల్లో కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి చేతుల మీదుగా నందిగాం సర్పంచ్ జయ్యాడ రమణమ్మ సత్కారం పొందారు. దీంతో ఆమెను అభినందిస్తూ స్థానికంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సన్మానించారు. దేశ రాజధానిలో గణతంత్రవేడుకల్లో పాల్గొని మండలానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చారని, మహిళలకు మరింత స్ఫూర్తి నింపారని కొనియాడారు.

అమరవీరుల ఆశయాలను కొనసాగించాలి

వజ్రపుకొత్తూరు రూరల్: అమరవీరులు ఆశయాలను కొనసాగించడమే వారికి నిజమైన నివాళి అని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు గొరకల బాలకృష్ణ అన్నారు. అక్కుపల్లిలో ఆదివారం అమరవీరుడు మద్దు రాంబాబు స్మారక సభను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. పీడిత ప్రజల నాయకుడిగా కామ్రేడ్ రాంబాబు పోరాటం చేశారని గుర్తు చేశారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు పోతనపల్లి కుసుమ, కుమారన్న, జయక్క, రాపాక మాధవరావు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

సోంపేట: సత్యసాయి సేవా సంస్థల కుటుంబ సభ్యులు పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలని సేవాసంస్థల జిల్లా అధ్యక్షుడు ఎన్ని లింగరాజు, సేవాదల్ ఇన్‌చార్జి రామచందర్ రావు అన్నారు. సోంపేట సత్యసాయి దివ్య మందిరంలో ఆదివారం సత్యసాయి సంఘప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో కోటి మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఆధ్యాత్మిక సమన్వయకర్త అనాధ గుప్త, యూత్ కోఆర్డినేటర్ ఈపరి రవి, జోనల్ కన్వీనర్ కందుల కాశీ, సమితి కన్వీనర్ టంకాల బాపూజీ, 200 మంది క్రియాశీలక సభ్యులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

● జెడ్పీ ఛైర్‌పర్సన్ పిరియా విజయ



ట్రోఫీ అందజేస్తున్న విజయ, నరేష్‌కుమార్‌అగర్వాలా

కవిటి: క్రీడలతో మానసిక ఉల్లాసం సాధ్యమని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే నరేష్‌కుమార్ అగర్వాలా అన్నారు. కవిటి ఉషోదయ ఇండోర్ స్టేడియంలో మూడు రోజులు జరిగిన జిల్లాస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీ ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడలతో స్నేహబంధాలు మెరుగుపడతాయన్నారు. టోర్నీ విజేతలుగా శ్రీకాకుళం పట్టణానికి చెందిన దత్త ప్రవీణ్ (ప్రథమ), కవిటికి చెందిన శేషు, సోమేష్ (ద్వితీయ), సోంపేటకు చెందిన మున్నా, తేజ(తృతీయ), శ్రీకాకుళంకు చెందిన మనోహర్, సాయి జోడీ (చతుర్ధ)స్థానాలు కైవసం చేసుకున్నారు. విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్, పి.శేఖర్, పి.వెంకటరమణ, తమరాల జయరాం, తుంగాన శరత్ ఉన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై ప్రత్యేక శ్రద్ధ

ఇచ్ఛాపురం రూరల్: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై సిబ్బంది మరింత శ్రద్ధ వహించాలని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఎం.ప్రసాదరావు అన్నారు. ఈదుపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆస్పత్రి సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ కార్యాకర్తలతో ఆదివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఏడు రకాల వైద్య పరీక్షల వివరాలను ఎప్పటికప్పుడు అంతర్జాలంలో నిక్షిప్తం చేయాలన్నారు. డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ వాన సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

● సంబరం



తిప్పనపుట్టుగ గ్రామంలో చింతామణి సంబరం ఆదివారం వైభవంగా జరిగింది. గ్రామస్తులు ఉదయం మేళ, తాళాలు మధ్య భూలోకమాత, కాళీమాత, ముత్యాలమ్మ అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం కవిటి చింతామణి, లొద్దపుట్టి ధనరాజుల తులసమ్మ అమ్మవార్లను ఊరేగింపుతో సంబర మహోత్సవాన్ని జరిపారు. జెట్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. -ఇచ్ఛాపురం రూరల్

● పుస్తక ప్రదర్శన



టెక్కలి శాఖా గ్రంథాలయంలో పోటీ పరీక్షల పుస్తకాలను ఆదివారం ప్రదర్శించారు. నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని గ్రంథాలయాధికారి బి.రూపావతి పేర్కొన్నారు. ఆర్ఆర్‌సీ, ఆర్ఆర్‌బీ, తపాలాశాఖ, డైట్‌సెట్‌తో పాటు ఇతర పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని..నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. -టెక్కలి

● అవగాహన ర్యాలీ



పలాసలో ఆదివారం క్యాన్సర్ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా పలాసలో పలాస రామకృష్ణ నరేంద్ర సేవా సమితి, గ్రీన్ ఆర్మీ, కాష్యూలాండ్, ప్రశాంతి సత్య సాయి సేవా సమితి, రాగోలు జెమ్స్ ఆస్పత్రి సిబ్బంది సంయుక్తంగా ఇందిరా గాంధీ బొమ్మ నుంచి కాశీబుగ్గ మూడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ చేశారు. యువకులు మత్తు పదార్థాలు, మద్యపానానికి దూరంగా ఉండాలని కోరారు. జెమ్స్ మేనేజరు చిన్నారావు, గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాలరావు, జామి మోహనరావు, బత్తిన ఓంకార్, రాముపాత్రో, నీలకంఠ పాత్రో, భాస్కర్ , ఆర్.సోమేశ్వరరావు, దాసరి శ్రీనివాసరావు, బోకర దుర్యోధన, అస్పాన మధుబాబు పాల్గొన్నారు. -కాశీబుగ్గ, పలాస

నీటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలి

● మండల సమావేశంలో సభ్యులు విజ్ఞప్తి



మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీరామమూర్తి

నందిగాం: వేసవిలో మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి ఆధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. వర్షాభావ పరిస్థితులతో రైతులు పంటలను నష్టపోయినా వ్యవసాయాధికారులు పట్టించుకోలేదని, ధాన్యం కొనుగోలులో మిల్లర్లు 4, 5 కేజీలు అదనంగా తీసుకున్నా వ్యవసాయ, రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని దీనబంధుపురం సర్పంచ్ మడపాల సంజీవరావు సభ దృష్టికి తీసుకువచ్చారు. ధాన్యం కొనుగోలు ఇబ్బందులపై ప్రత్యేకంగా చర్చించి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్దామని ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి సూచించారు. పెద్దతామరాపల్లి -తూముకొండ రహదారిలో సాగరంపేట నుంచి దిమ్మడిజోల వరకు పాడైన రోడ్డుకు మరమ్మతులు చేయించాలని పలువురు సభ్యులు కోరారు. అలాగే చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో పనిచేసే కార్మికులకు ఉపాధిహామీ పథకం ద్వారా వేతనాలు చెల్లించాలని పలువురు సభ్యులు విజ్ఞప్తి చేశార. గ్రామీణ మంచినీటి విభాగంపై జరిగిన చర్చలో రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో మంచినీటి ఇబ్బందుల్లేకుండా చూడాలని సభ్యులు యర్ర చక్రవర్తి, అట్టాడ శ్రీనివాసరావు కోరారు. గ్రామాల్లో జలజీవన్ మిషన్ పథకాన్ని త్వరితగతిన పూర్తి చేసి అన్ని గ్రామాలకు మంచి నీరు అందించాలని ఎంపీపీ శ్రీరామమూర్తి సూచించారు. అన్ని గ్రామాల్లో ఆసరా సంబరాలు చేయాలని వెలుగు సిబ్బందికి సూచించారు. సమావేశంలో ఎంపీడీవో రాజారావు, వైస్ ఎంపీపీ రేగల లక్ష్మీకాంతం, మండల ప్రత్యేక ఆహ్వానితుడు చిన్ని జోగారావు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవకులతోనే గ్రామాభివృద్ధి



వాటర్‌ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న తిలక్

కోటబొమ్మాళి: నిస్వార్థంగా సేవలు చేసేవారితోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ అన్నారు. కమలనాభపురం గ్రామంలో కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమ సుందరరాజు దివంగత కుమార్తె కుమారి పేరుతో చారిటబుల్ ట్రస్టును ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా రూ. 25 లక్షల వ్యయంతో చేపట్టనున్న వాటర్‌ప్లాంటు నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ.. గ్రామస్తుల కోసం వాటర్‌ప్లాంటు నిర్మాణానికి హేమసుందరరాజు ముందుకురావడం అభినందనీయమన్నారు. అలాగే వాటర్‌ప్లాంటు నిర్మాణానికి స్థలం ఇచ్చిన దుంపల ధర్మారావు, మోహనరావు సోదరులను అభినందించారు. వాటర్‌ప్లాంటు నిర్మాణానికి ప్రభుత్వం నుంచి కూడా నిధులు సమకూరేలా కృషి చేస్తానన్నారు. గ్రామస్తులు కూడా గ్రామాభివృద్ధికి నడుంబిగించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రోణంకి ఉమామల్లేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు దుబ్బ వెంకటరమణారావు, ఎంపీటీసీ సభ్యులు అన్నెపు రామారావు, వాన అసిరి నాయుడు, బగాది దివాకర్, పార్టీ నాయకులు పేడాడ వెంకటరావు, ఎస్.వినోద్, అల్లు కల్యాణి, సర్పంచ్‌లు ఎస్.ధనలక్ష్మి, కె.కేశవరావు, రెడ్డి లక్ష్మణ, పట్నాన లలితాంబ, కె.క్రిష్ణమూర్తి, ఏఎంసీ వైస్ చైర్మన్ బొడ్డు వెంకటరమణ, మండల కన్వీనర్ నూక సత్యరాజ్, జేసీఎస్ మండల ఇన్‌చార్జి జి.నాగభూషణరావు ఉన్నారు.

ఉత్సాహంగా ఫిజికల్ సైన్స్ ప్రతిభా పరీక్ష



పార్టీలో చేరినవారికి కండువాలు వేస్తున్న విజయ, సాయిరాజ్ తదితరులు

కవిటి: సాంకేతిక విజ్ఞానానికి మానవ మేథస్సు మూల కేంద్రమని ఎంఈవో ధనంజయమజ్జి, స్కూల్‌కాంప్లెక్స్ చైర్మన్ బి.మల్లేశ్వరరావు అన్నారు. రాష్ట్ర ఫిజికల్‌సైన్స్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో మండల స్థాయి ఫిజికల్ సైన్సు ప్రతిభా పరీక్షను ఆదివారం నిర్వహించారు. 20 ప్రభుత్వ, జెడ్పీ, ఆదర్శ, కేజీబీవీ పాఠశాలల నుంచి 65 మంది బాలబాలికలు ఇంగ్లిషు, తెలుగు, ఒరియా మీడియంలో పరీక్షలు రాశారు. మండల ఉదయ్ (కవిటి), కె.కులశేఖర్ (ముత్యాలపేట), సీహెచ్ శ్యాంసాయి రాజపురం బాలురు పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చడం ద్వారా జిల్లాస్థాయి ప్రతిభా పరీక్షకు అర్హత సాధించారు. మండలస్థాయిలో ఒక్కో విభాగంలో తొలిమూడుస్థానాలు సాధించిన వారికి మండల ఫిజికల్‌సైన్స్‌ఫోరం ఆధ్వర్యంలో బహుమతులు, ప్రశంసాపత్రాల్ని అందించారు. కార్యక్రమంలో సభ్యులు టి రాధిక, అరుణకుమారి, రామారావు, ఎల్.వెంకటరావు, పి.వేణుగోపాల్, బొడ్డ జయరాం ఉన్నారు.

‘ఆయన చరిత్ర అందరికీ తెలుసు’



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నందిగాం: గత ప్రభుత్వ హయంలో లక్షలాది రూపాయలు దోచుకున్న నందిగాం మండల టీడీపీ అధ్యక్షుడు పినకాన అజయ్‌కుమార్ చరిత్ర అందరికీ తెలుసునని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. నందిగాంలో వారంతా విలేకర్లతో ఆదివారం మాట్లాడారు. టీడీపీ నాయకుడునని చెప్పుకొని అధికారంలో ఉన్నప్పుడు అమాయక గిరిజనుల పేరుతో రుణాలు పొందిన అజయ్‌కుమార్.. పేరాడ తిలక్‌ను విమర్శిస్తే సహించేది లేదన్నారు. దిమిలాడ సొసైటీలో బినామీల పేరుతో లక్షలాది రూపాయలు దోచుకున్న అజయ్ నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మండలంలో మీరు చేసిన దోపిడీపై విజిలెన్స్ అధికారులు విచారణకు వస్తే కులాన్ని అడ్డపెట్టుకొని వైఎస్సార్‌సీపీ నాయకుల కాళ్లు పట్టుకొని బతిమిలాడుకున్న విషయం మరిచిపోతే ఎలా అని ప్రశ్నించారు. అచ్చెన్నాయుడు మెప్పు కోసం లేనిపోనివి మాట్లాడితే సహించమన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న మంచితో ప్రజలంతా వైఎస్సార్‌సీపీను, ఆ పార్టీ నాయకులను ఆదరిస్తుంటే తట్టుకోలేక దువ్వాడ శ్రీనివాస్, పేరాడ తిలక్‌లను విమర్శించడం తగదన్నారు. ఎస్సీ, ఎస్టీ రుణాల పేరుతో ఎంత వెనుకవేసుకున్నావో తెలియనిది కాదన్నారు. ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, చిన్ని జోగారావు, రేగల లక్ష్మీకాంతం, అంబోడి విష్ణు, అట్టాడ శ్రీనివాసరావు, తమిరె రాజు ఉన్నారు.

జిల్లాస్థాయి కబడ్డీ పోటీల విజేత గొల్లమాకన్నపల్లి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

మందస: ఉద్దాన ప్రాంతమైన పెద్దలింబుగాంలో నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు ఆదివారంతో ముగిశాయి. 56 జట్లు తలపడ్డాయి. ఫైనల్‌లో గొల్లమాకన్నపల్లి, మామిడిపల్లి జట్లు తలపడగా.. విజయతగా గొల్లమాకన్నపల్లి నిలిచింది. ద్వితీయ స్థానాన్ని మామిడిపల్లి, తృతీయస్థానాన్ని శ్రీకాకుళం, నాలుగో స్థానాన్ని లింబుగాం జట్లు కైవసం చేసుకున్నాయి. వీరికి ఎంపీటీసీ మాజీ సభ్యుడు మండల లచ్చయ్య, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సాలీన లక్ష్మీనారాయణ, మండల ధర్మారావు, దాసరి చంద్రశేఖర్‌లు అందించిన రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10వేలు నగదుతో పాటు షీల్డ్ అందజేశారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో సెక్రటరీ ఎ.చిరంజీవరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్.అప్పలస్వామి, నర్తు రవి(తిరుపతి), పులారి వీరస్వామి, బదకల రేఖారావు, నర్తు దేవేంద్ర, ఈశ్వరరావు, తలగాన రాజశేఖర్, బదకల జానకిరావు, పులారి అప్పలస్వామి పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

టెక్కలి రూరల్: అక్కవరం గ్రామంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు టెక్కలి ఎస్సై-2 వి.వెంకటేశ్వరరావు ఆదివారం సాయంత్రం తన సిబ్బందితో దాడులు చేపట్టారు. గ్రామంలోని కుమ్మవీధి సమీపంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.7,340 స్వాదీనం చేసుకున్నట్టు చెప్పారు.

నీటి సౌకర్యానికి చర్యలు

కంచిలి: నీటి సౌకర్యానికి పంచాయతీ పరంగా అన్ని రకాల చర్యలు చేపడుతున్నామని తలతంపర సర్పంచ్ దొళాయి జగబంధు అన్నారు. తలతంపర పంచాయతీ పరిధి చిల్లొపుట్టుగ గ్రామస్తుల దాహార్తిని తీర్చేందుకు కొత్త బోరు, మోటారు ఏర్పాటు కోసం సర్పంచ్ చేతులమీదుగా ఆదివారం భూమిపూజ చేశారు. స్థానిక ఎంపీటీసీ సభ్యుడు బృందావన్‌సాహు, వార్డు మెంబర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన కిడ్నీ పరిశోధన కేంద్రం సూపరింటెండెంట్



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డాక్టర్ పద్మజ

కాశీబుగ్గ: శ్రీకాకుళం జిల్లా నూతన కలెక్టర్ మంజీర్ జిలానీని పలాస వైఎస్సార్ కిడ్నీ పరిశోధన కేంద్రం, 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, డయాలసిస్ యూనిట్ సూపరింటెండెంట్ అల్లు పద్మజ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఉద్దాన కిడ్నీ వ్యాధులు, అక్కడ పరిస్థితిపై చర్చించారు.

సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

నందిగాం: మహిళలకు వెన్నుదన్నుగా నిలుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి కోరారు. హరిదాసుపురంలో సర్పంచ్ కణితి ధనలక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఆసరా సంబరాల్లో ఆయన మాట్లాడుతూ.. గతంలో చంద్రబాబు ద్వారా రుణమాఫీ చేస్తానని చెప్పి మోసం చేశారన్నారు. జగనన్న మాత్రం చెప్పిన విధంగా నాలుగు విడతల్లో సంఘాల అప్పులన్నీ తీర్చారని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో జగన్‌కు అండగా నిలవాలని కోరారు. అనంతరం మహిళలతో కలసి ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు కణతి తరిణమ్మ, నారాయణమూర్తి, రామచంద్రుడు, కేశవరావు, చిన్ని జోగారావు, కవిటి ఎర్రన్న ఉన్నారు.

తహసీల్దార్‌ను హత్యచేసిన వారిని అరెస్ట్ చేయాలి

కాశీబుగ్గ: విశాఖ జిల్లా చినగదిలి తహసీల్దార్ సనపల రమణయ్య హత్యకు కారణమైన వాళ్లని అరెస్ట్ చేసి చర్యలు తీసుకోవాలని శ్రీకాకుళం జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు కొర్రాయి బాలకృష్ణయాదవ్ కోరారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. హత్యను తీవ్రంగా ఖండించారు. అతని ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. తిత్లీ తుఫాన్ సమయంలో వజ్రపుకొత్తూరు మండల తహసీల్దార్‌గా అతని సేవలు మరువలేమన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయానికి సైనికుల్లా పనిచేస్తాం



శ్రీనివాస్‌ను కలిసిన సోషల్ మీడియా కార్యకర్తలు

టెక్కలి: టెక్కలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయానికి సైనికుల్లా పనిచేస్తామని నియోజకవర్గస్థాయి వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలు వెల్లడించారు. ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి దువ్వాడ శ్రీనివాస్‌ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో విప్లవాత్మకంగా అందజేసిన సంక్షేమ పథకాల లబ్ధిపై సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేస్తామని, ప్రతిపక్షాల చేస్తున్న కుట్ర పూరిత చర్యలను ఎండగడతామని పేర్కొన్నారు. దువ్వాడను కలిసిన వారిలో కె.కృష్ణప్రసాద్, ఐ.అభిరామ్, నాగేంద్ర, డి.నరేష్, బి.మల్లేశ్వరరావు, వి.గోపాలకృష్ణ, డి.శాంతారావ్, కె.అప్పారావ్ ఉన్నారు.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు



పార్టీలో చేరినవారికి కండువాలు వేస్తున్న విజయ, సాయిరాజ్ తదితరులు

● కండువాలు వేసి ఆహ్వానించిన జెడ్పీ ఛైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్

కవిటి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో తమ సామాజిక వర్గాన్ని బీసీల్లో చేర్చగా.. ఆయన కొడుకు ప్రస్తుత సీఎం జగనన్న మరిన్ని సౌకర్యాలు కల్పించి తమ జీవితాల్లో వెలుగులు నింపారని సామంతుల కులస్తులు అన్నారు. ఆర్.తొత్తిడిపుట్టుగలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆర్.తొత్తిడిపుట్టుగ, కె.త్తిడిపుట్టుగ, పెట్టావీధి, గొద్దాయివీధి, గొనియావీధి, జన్నివీధి తదితర 16 గ్రామాల్లోకి టీడీపీకి చెందిన 500 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. వారందరికీ జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్‌లు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఎస్.సునీల్, పి.దేవేంద్ర, పి.ఖగేష్, పి.జోగులు, పి.లక్ష్మణరావు, పి.నవీన్, వై.ప్రవుల్లా, కె.వెంకటేష్, పి.మోహనరావు, పి.కృష్ణ, ఢిల్లేష్, మోహన్ ఉన్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ తమకులానికి అన్నివిధాలుగా ఆదుకోవాలని కోరారు. వారి కోరిక మేరకు తొత్తిడి పుట్టుగలో స్థలాన్ని కేటాయించి రూ.10 లక్షల నిధులతో సామాజిక భవనాన్ని కేటాయిస్తూ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్, నాయకులు సనపల జానకీరావు, పూడి నీలాచలం, సనపల కృష్ణారావు, సత్యన్నారాయణపాఢి, వై.అశోక్, బడ్డాయి మురళి ఉన్నారు.

యువజన సంఘాలకు ప్రోత్సాహం



భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్ పిరియా విజయ తదితరులు

కవిటి: సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండే యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. కవిటిలో ఉషోదయ యువజన సంఘం భవనం నిర్మాణానికి జిల్లాపరిషత్ నుంచి రూ.10 లక్షల నిధులు మంజూరు చేశారు. దీనికి సంబంధించిన పనులకు చైర్‌పర్సన్ విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యేలు పిరియా సాయిరాజ్, నరేష్‌కుమార్ అగర్వాలాలు ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నాయకులు కడియాల ప్రకాష్, పాండవ శేఖర్, కృష్ణరాళో, ఎన్ని అశోక్, బద్రి ప్రకాష్, నర్తు అశోక్, సంఘం గౌరవ అధ్యక్షులు బెందాళం చిట్టిబాబు, తమరాల జయరాం ఉన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న శ్రీదేవి

వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కుంది రామారావు ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబాన్ని మంత్రి సీదిరి అప్పలరాజు సతీమణి శ్రీదేవి ఆదివారం పరామర్శించి.. రూ. 50 వేల సాయాన్ని అందజేశారు. రామారావు పార్టీకి చేసిన సేవలతో పాటు నిరుపేద కుటుంబం కావడంతో కుటుంబానికి అర్థిక సాయం అందించి అండగా నిలిచారు. ఉప సర్పంచ్ కోడ సోమేశ్వరరావు, నాయకులు ఎంపల్లి యోగి, జ్యోత్స్న, కుంది కామేశ్వరరావు, జోగి రాజు, అర్జల దివాకర్ ఉన్నారు.

జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

కాశీబుగ్గ: కేరళ రాష్ట్రంలో ఏర్పాటు చేసిన విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని శ్రీకాకుళం జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు కొర్రాయి బాలకృష్ణ యాదవ్ ఓ ప్రకటనలో కోరారు. జీడి పంటకు మద్దతు ధర ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింట్ అయిన శ్రీకాకుళం జిల్లా, నందిగాం మండలం, కణితివూరు గ్రామం, అన్నెపు లేటు జగన్నాయకులు పెద్దకుమారుడు అన్నెపు అప్పారావు గారు ఇచ్చిన భోగట్టాపై యావన్మందికీ తెలియజేయునది ఏమనగా! నా క్లయింట్ మరియు తన సోదరుడు అన్నెపు చక్రధరరావు వారి ఆరువురి తండ్రి అన్నెపు జగన్నాయకులు కుటుంబ ఆస్తులను పాలిరత్తుల ద్వారా విభజించుకుని N.J స్టాంపు వ్రాసుకున్నారు. ఆ పంపకంలో నా క్లయింట్ మరియు తన సోదరుడు వారి తండ్రి గారైన శ్రీ అన్నెపు జగన్నాయకులు గారికి ఈ పబ్లిక్ నోటీసు షెడ్యూలు ఉన్న మిల్లు (డీజిల్‌తో నడిచే మిల్లు) తన జీవితకాలంలో అనుభవించుటకు కేటాయించడం జరిగినది. సదరు శ్రీ అన్నెపు జగన్నాయకులు గారు సదరు మిల్లుతో వచ్చే ఆదాయంతో జీవిస్తూ, తే. 1/12/2018న మరణించితిరి. వారి తండ్రి గారి పెద్దకర్మ కార్యక్రమాల ఖర్చులు అన్నియు నా క్లయింట్ భరించుకున్నారు. నా క్లయింట్ ఛత్తీస్‌ఘడ్ రాజధాని రాయపూర్‌లో ఉన్నందున వారి తండ్రి తదనంతరం చిన్న కుమారుడైన అన్నెపు చక్రధరరావు ఆ మిల్లును నడిపించినారు. ప్రథమ వర్ధంతి అయిన తరువాత షెడ్యూలు ఆస్తి పంపకాలు చేసుకుందామని చెప్పి నా క్లయింట్‌తో తమ్ముడు చక్రధరరావు అన్నారు. అదే విధంగా నా క్లయింట్ తండ్రి గారికి ప్రథమ వర్ధంతి అయిన తరువాత నా క్లయింట్ మిల్లు మరియు దాని చుట్టూవున్న ఆస్తిని విభజించుకుందామని అడుగగా కాలయాపన చేసినారు. తదుపరి నా క్లయింట్ పలాస జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో OS 113/22 & IA 599/22 దావాను సదరు షెడ్యూలు ఆస్తిని పార్టిషన్ దావా వేసియున్నారు. సదరు దావా పలాస జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో పెండింగ్‌లో ఉన్నది. సదరు ఆస్తిని నా క్లయింట్ సోదరుడు అయిన అన్నెపు చక్రధరరావు సదరు మిల్లులో ఉన్న 2 లక్షల విలువగల మెషనరీ ఇతరులకు అమ్మివేశాడు. మరియు సదరు దావా ఆస్తి/షెడ్యూలు ఆస్తి వేరేవారికి అమ్మజూపుచున్నాడు. సదరు ఆస్తి సర్వజనులలో ఎవరైనా కొన్ననూ, అగ్రిమెంటు కట్టిననూ, తనఖాలు పొందిననూ అవి నా క్లయింటుకు బైండింగ్ కావు మరియు చెల్లనేరవు.

OS 113/22 షెడ్యూలు ఆస్తి: శ్రీకాకుళం జిల్లా, వజ్రపుకొత్తూరు మండలం, పెద్దమురహరిపురం గ్రామంలో గల డిఫెండ్ మిల్లు సర్వేనెం. 97/4B లో ఉన్నది. మరియు కాశీబుగ్గ సబ్‌రిజిస్ట్రార్ ఇలాఖాలో ఉన్నది. షెడ్యూలు 10 సెంట్ల ఆస్తికి హద్దులు: తూర్పు: రోడ్డు, దక్షిణం: రోడ్డు, పడమర: బొమ్మలి గన్నయ్య గారి జీడితోట, ఉత్తరం: దున్న అప్పలమ్మ గారి జీడితోట.

సం/- పి.జి.రాజరత్నం, B.A., B.L., అడ్వకేట్,
ఓం శాంతినగర్, కాశీబుగ్గ, శ్రీకాకుళం. సెల్: 9985827526